


నేడు పదో తరగతి ఫలితాలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించగా ఏప్రిల్ 15వరకు మూల్యాంకనం నిర్వహించారు. పదో తరగతి ఫలితాలు ఎప్పుడెప్పుడా అని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్న నేపథ్యంలో విద్యాశాఖ బుధవారం ఉదయం 11గంటలకు ఫలితాలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సారి మార్కుల విధానంతో పాటు గ్రేడ్ విధానంలో ఫలితాలను విడుదల చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 22వేల 855 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు.



సంస్థాగత బలోపేతంపై కాంగ్రెస్ దృష్టి



- స్థానిక ఎన్నికలకు ముందే సంస్థాగత కమిటీలపై కసరత్తు
- నగర కాంగ్రెస్‌కు కూడా త్వరలోనే కొత్త అధ్యక్షుడు
- ప్రయత్నాలు చేస్తున్న ఆశావహులు
- వచ్చే నెల 20లోగా డీసీసీలకు కొత్త సారథులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున అంతకుముందే పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు వచ్చేనెల 20వ తేదీలోగా కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులను నియమించేందుకు పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఈ మేరకు జిల్లాలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి ఆ సమావేశం ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణానికి పిలుపునిచ్చేలా పార్టీ నిర్ణయం తీసుకుంది. జిల్లాకు ఇద్దరు చొప్పున పీసీసీ పరిశీలకులను నియమించారు. జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను కలుపుకొని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు జిల్లా కమిటీలను వేసేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశంతో పాటు మే 10లోగా నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఆ సమావేశాల ద్వారా మండల కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్, గ్రామ శాఖల అధ్యక్షుల పేర్లను తీసుకోనున్నారు. ఇప్పటికే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మానాల మోహన్‌రెడ్డి గత ఏడాది రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా నియామకం కాగా గత సెప్టెంబర్‌లో నూతన పీసీసీ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన మహేష్ కుమార్‌గౌడ్ నియామకమయ్యారు. పీసీసీ అధ్యక్షుడు నియామకమై ఏడు నెలలు పూర్తవుతున్నా.. ఇప్పటికీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను కానీ, పీసీసీ కార్యవర్గాన్ని కానీ ఏర్పాటు చేయలేదు. దీంతో పార్టీ అధిష్ఠానం సైతం గ్రామస్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు దృష్టి పెట్టింది. ఈ మేరకు మే20లోగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకంతో పాటు మండల కాంగ్రెస్, గ్రామ శాఖ అధ్యక్షుల నియామకం పూర్తి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ఐదుగురు పేర్లను, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ముగ్గురు పేర్లను సమావేశాల ద్వారా ప్రతిపాదనలు తీసుకోనున్నారు. జిల్లాకు నియమించబడిన పరిశీలకులు వీరి పేర్లను మే 20లోగా అధిష్ఠానానికి పంపితే మే30లోగా జిల్లా అధ్యక్షులతో పాటు మండల అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గాన్ని ప్రకటించేలా పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

20లోగా సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుల నియామకం కోసం టీపీసీసీ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కె.తిరుపతిలను టీపీసీసీ జిల్లా పరిశీలకులుగా నియమించింది. జిల్లా కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం డిచ్‌పల్లిలో నిర్వహించగా మే 4వ తేదీ నుంచి 10వ తేదీలోగా నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు గ్రామ శాఖ అధ్యక్షుల నియామకం కోసం ముగ్గురు చొప్పున పేర్లను తీసు కోనున్నారు. మే 13 నుంచి 20లోగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు నగర కాంగ్రెస్ అధ్యక్షుడి కోసం వివిధ సమీకరణాల వారీగా ఐదుగురు పేర్లను తీసుకొని అధిష్ఠానానికి పరిశీలకులు తమ నివేదికలను ఇవ్వనున్నారు.

ఆశావహుల ప్రయత్నాలు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి నియామకం కోసం అధిష్ఠానం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో అధ్యక్ష పదవి కోసం ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం కాగా ఆయన స్థానంలో కొత్త వారిని నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో సీనియర్ నాయకులను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించే అవకాశాలు ఉన్నాయి. రాబో యే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రతిపక్షాలను దీటుగా ఎదు ర్కొనే నాయకుడిని జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఆర్మూర్ నియోజకవర్గం నుంచి మార చంద్రమోహన్, నరాల రత్నాకర్‌లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి రేస్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

నగర అధ్యక్షుడి రేసులో ఆశావహులు

కాంగ్రెస్ నగర అధ్యక్ష పదవి కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రస్తుతం పనిచేస్తున్న కేశవే ణు నుడా చైర్మన్‌గా నియామకం కావడంతో కొత్తవారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న నరాల రత్నాకర్ నగర అధ్యక్ష పదవిని సైతం ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, రాంభూపాల్, బొబ్బిలి రామకృష్ణ, జావిద్ అక్రమ్, గడుగు రోహిత్‌లు సైతం నగర కాంగ్రెస్ అధ్యక్షుడి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.


అరికెల నర్సారెడ్డి


శేఖర్‌గౌడ్


నగేష్‌రెడ్డి


రత్నాకర్


తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేయడం బయటే ఉన్న అధికారులు

మోపాల్ తహసీల్దార్ కార్యాలయానికి తాళం

- అద్దె చెల్లించకపోవడంతో తాళం వేసిన భవన యజమానురాలు

మోపాల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం భవన యజమాని తాళం వేశారు. గత 14నెలల నుంచి భవన కిరాయి ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన యజమానురాలు గంగవ్వ.. మధ్యాహ్నం వేళ కార్యాలయంలో ఉన్న అధికారులందరినీ బయటకు పంపించి తాళం వేశారు. ఈ సందర్భంగా భవన యజమానురాలు మాట్లాడుతూ.. గత 14నెలల నుంచి అధికారులు తనకు ప్రతినెలా కిరాయి రూ.10వేలు ఇవ్వడం లేదన్నారు. దీంతో ఎన్నోసార్లు అధికారులను కలిసి వేడుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటలపాటు కార్యాలయానికి తాళం వేయడంతో అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత తొందరలోనే ఇంటి కిరాయి చెల్లిస్తామని ఉన్నతాధికారులు ఆమెకు హామీ ఇవ్వడంతో కార్యాలయానికి తాళం తీశారు.

వీడీసీల పెత్తనానికి కళ్లెం వేయాలి

కులవృత్తుల వారిని వేధిస్తున్న వీడీసీలపై చర్యలు తీసుకోవాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వీడీసీల పెత్తనానికి కళ్లెం వేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మంగళవారం 'చలో ఆర్మూర్' కార్యక్రమంలో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీల ఐక్యతా ర్యాలీ, వీడీసీలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ వ్యవసాయ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాలల్లో కులవృత్తులు చేసుకొనే గీతకార్మికులు, గంగపుత్రులు, రజకులు, నాయీ బ్రాహ్మణులు తదితరల కులాల వారిని వీడీసీ (విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ) సభ్యులు వేధిస్తున్నారన్నారు. తాళ్లరాంపూర్‌లో గత నెల రోజులుగా వీడీసీ సభ్యులు గీతకార్మికులను వేధిస్తున్నారని వారికి చెందిన ఈతవనం దగ్ధం చేశారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కులవృత్తుల వారికి చేయుతనందించి పూర్తి న్యాయం చేశామన్నారు. గ్రామాభివృద్ధి కమిటీలో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. వీడీసీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీలను రద్దు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని 15 రోజుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్, ప్రజాసంఘాల జేఏసీ నాయకులు వి. ప్రభాకర్, సావెల్ గంగాధర్, నర్సింహాచారి, బుస్సాపూర్ శంకర్, యూటీఆర్‌పీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు అరుణ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


కూనేపల్లి సొసైటీ గోదాం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కూనేపల్లి గోదాంలోనే ధాన్యం దింపాలి

- సొసైటీ గోదాం ఎదుట కళ్యాపూర్, కూనేపల్లి రైతుల ధర్నా

రెంజల్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): కళ్యాపూర్, కూనేపల్లి గ్రామాల రైతులను దృష్టిలో ఉంచుకుని కూనేపల్లి గ్రామంలో నిర్మించిన గోదాంనందు తమ ధాన్యాన్ని దింపాలని కళ్యాపూర్ గ్రామ రైతులు మంగళవారం సొసైటీ గోదాం ముందు ధర్నా నిర్వహించారు. దూపల్లి సొసైటీ పరిధిలో ఉన్న కళ్యాపూర్, కూనేపల్లి గ్రామాల రైతులు దూపల్లి రైతుల ధాన్యాన్ని కూనేపల్లి సొసైటీలో డంప్ చేయగా తమ గ్రామంలో ఉన్న గోదాంలో మా ధాన్యాన్ని దింపడం లేదంటూ రైతులు ధర్నా నిర్వహించారు. రైతుల సౌకర్యం నిర్మించిన గోదాంలో తమకు ప్రాధాన్యం కల్పించకుండా ఇతర గ్రామాల ధాన్యాన్ని తరలించడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. సొసైటీ కార్యదర్శి జీవన్ రెడ్డి రైతుల వద్దకు రాకుండా వెళ్లిపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో రైతులు జలయ్య, మోహన్, లింగం, మైని మోహన్, సాయిలు, దాసు, గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



- మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

- అవగాహన సదస్సులో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి దోహదం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి ఆడిటోరియంలో భూ భారతి నూతన చట్టంపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని భూభారతి చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ఈ చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. కాగా, పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తొలి విడతగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3500మంది చొప్పున నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. ధరణి వల్ల పరిష్కారం కాని అనేక భూ సంబంధిత సమస్యలు భూభారతి ద్వారా పరిష్కారం జరిగేలా ప్రభుత్వం ఈ నూతన చట్టాన్ని అమలులోకి తెచ్చిందని అన్నారు. ధరణిలో ఉన్న భూముల రికార్డులను భూభారతిలో నమోదు చేస్తారని అన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూ భారతితో శాశ్వత పరిష్కారం..

: కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

కోటగిరి: ధరణిలో పరిష్కారం కాని భూ సంబంధిత సమస్యలకు భూభారతితో శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కోటగిరి, పొతంగల్ మండలాల రైతులకు భూభారతి నూతన చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వచ్చే రెండు నెలల్లో భూభారతి చట్టంపై రైతులకు మరింత అవగాహన కలిగించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో చందర్, వ్యవసాయ అధికారులు రాజు, నితిషా, కొత్తపల్లి విండో అధ్యక్షుడు సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి..

ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కోటగిరి ఉమ్మడి మండలానికి చెందిన రైతులు ధాన్యం కొనుగోళ్లలో ఎకరానికి 80బస్తాలను మాత్రమే తీసుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పంట దిగుబడి పెరిగిందని, నిబంధనలు సడలించి రైతులు ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరారు.



డ్రా పద్ధతిలో రెండు బార్లను దక్కించుకున్న మర్రి రమణ

కొత్తగా నాలుగు బార్లకు లక్కీడ్రా

- డ్రా పద్ధతిలో రెండు బార్లను దక్కించుకున్న ఒకరు
- నగరంలోని మూడు బార్లకు 56 దరఖాస్తులు
- ఆర్మూల్‌లోని ఒక్క బార్‌కు 14 దరఖాస్తులు



నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న నాలుగు బార్లకు కలెక్టరేట్‌లో మంగళవారం లక్కీడ్రా నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలో మూడు బార్లకు ఆర్మూర్ పరిధిలో ఒక్క బార్‌కు నిజామాబాద్ అదనపు కలెక్టర్ అంకిత్ లక్కీ డ్రా తీశారు. ఇందులో నగరంలోని 3బార్లకు గాను 56దరఖాస్తులు వచ్చాయి. నగరంలోని 3బార్లకు గాను రెండు బార్లు అంబేద్కర్ కాలనీకి చెందిన మర్రి రమణను వరించాయి. మిగతా ఒక్కబార్ పోతన్‌కార్ సందీకర్‌కు లభించింది. ఆర్మూర్‌లోని ఒక్కబార్‌కు 14 దరఖాస్తులు రాగా లక్కీడ్రాలో ఆర్మూర్‌కు చెందిన లక్ష్మీనారాయణకు వచ్చింది. ఈ లక్కీడ్రా కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ కుమార్, సిబ్బంది దేవేందర్, రాణా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి


ఎమ్మెల్యే, కలెక్టర్ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):బోధన్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు లయన్స్‌క్లబ్ ఎదురుగా ఉన్నమున్సిపల్ కాంప్లెక్స్‌లో జనరల్ ఆసుపత్రి కోసం లయన్స్‌క్లబ్‌కు కేటాయిస్తున్నట్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పత్రాలను లయన్స్ ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, ప్రతాప్ గుప్తాకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైనసేవలు అందించాలన్నారు.లయన్స్ లాగానే ఆసుపత్రికూడా మంచి పేరు సాధించాలన్నారు.లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు.

ఖాజాపూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ


అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న బైరి నరేష్

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం బైరి నరేష్ ఆవిష్కరించారు. బైరి నరేష్ గ్రామానికి చేరుకునే ముందు కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాత కేసుల విషయమై పోలీసులు బైరి నరేష్‌కు నోటీసులు ఇచ్చారు. సభలో ఎలాంటి అసభ్యకర వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి ఖాజాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జన్నేపల్లి బంద్ ప్రశాంతం


జన్నేపల్లిలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఇటీవల జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకులైన 28మందిని ఉగ్రవాదులు కాల్చి చంపడం పట్ల నిరసిస్తూ ఈ బంద్ పాటించారు. ఈ సందర్భంగా హిందు సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అమాయకులపై దాడులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

మేడేను జయప్రదం చేయాలి

కోటగిరి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మేడేను జయప్రదం చేయాలని సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ నలంద పాఠశాలలో మంగళవారం మేడే వాల్‌పోస్టర్లను సీపీఐ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానమైన పనికి సమానమైన వేతనం ఇవ్వాలని, మనుషులు యంత్రాలు కాదు నిరంతరం పని చేయరు అని చెప్పి కార్మికుల హక్కుల కోసం పోరాడి రక్తం చిందించింది మే 1వ తేది అని పేర్కొన్నారు. రక్తంతో తయారు చేసిన ఎర్రజెండాను కార్మికులు ఎగురవేసి పండుగలా జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు విఠల్ గౌడ్, గంగాధర్, సాయిలు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి ఒకరోజు జైలుశిక్ష

రెంజల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి అర్ధరాత్రి సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి న్యూసెన్స్ సృష్టించిన నీలా గ్రామానికి చెందిన మహమ్మద్ అనే వ్యక్తికి సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. ఎవరైనా మద్యం సేవించి అర్ధరాత్రి సమయంలో డయల్ 100, 108కు కాల్ చేసి న్యూసెన్స్ చేస్తే చట్టపరంగాచర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

దూపల్లిలో పోలీసుల కళాప్రదర్శన

రెంజల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామంలో పోలీసుల కళాబృందం చేత ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసు కళాబృందాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో మూఢనమ్మకాలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, యువత దుర్ అలవాట్లకు పాల్పడకుండా సన్మార్గంలో నడవాలని, గ్రామంలో శాంతిభద్రతకు విఘాతం కలగకుండా చూడాలని ఎస్ఐ పేర్కొన్నారు. యువత చెడు దారిలో కాకుండా సన్మార్గంలో నడవాలని ఎస్ఐ సూచించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏమైన సమస్యలు తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బాబన్న, కానిస్టేబుళ్ల, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

హంగర్గలో చోరీ

● బంగారు నగలతో పాటు బైక్ అపహరణ

కోటగిరి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో పుట్టి శ్రీకాంత్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వేసవికాలం కావడంతో ఇంటికి తాళం వేసి దాబాపైకి వెళ్లి పడుకున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు ఆరుబయట ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. శ్రీకాంత్ కుటుంబ సభ్యులు తెల్లవారగానే లేచి కిందికి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండగా బీరువా పగులగొట్టి ఉండడంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని కోటగిరి ఎస్ఐ సునీల్ పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి అన్న లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


బీరువాను ధ్వంసం చేసిన దృశ్యం

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


జక్రాన్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైనవారందరికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జక్రాన్‌పల్లి, కలిప్యాక్, తొర్లికొండ, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చాక ఏడాదిన్నరలో జక్రాన్‌పల్లి మండలంలో రూ. 30 కోట్ల తో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మొదటి విడతలో అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. రెండవ విడతల ఇళ్ల స్థలాలు లేనివారిని గుర్తించి ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామన్నారు. మొదటి విడతలో జక్రాన్‌పల్లి గ్రామానికి 80 ఇండ్లు మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటప్రకారం రేషన్ ద్వారా సన్నబియ్యం ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఇస్తున్నామన్నారు. ప్రజలు సంతోషంగా సన్నబియ్యం వండుకుని మూడుపూటలు భోజనం చేస్తున్నారన్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నెలలోగా రేషన్ కార్డులను అందజేస్తామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. మహిళలకు లక్షకోట్లు వడ్డీలేని రుణాలు ఇస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రానున్న ఐదేళ్లలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల లో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. అభివృద్ధి విషయంలో రూరల్ నియోజకవర్గం పరుగులు పెడుతుందన్నారు. రైతులను రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు ఆందోళన చెందడం అవసరం లేదని దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. దేశంలో 15 రాష్ట్రాలలో బీజేపీ పాలిస్తుందని ఆ పదిహేను రాష్ట్రాలలో తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను ఆ రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి మాజీ సీఎం కేసీఆర్ చేసిన అప్పులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వడ్డీ, అసలు కడుతూ అప్పులు తీరుస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో కేంద్రం యాబ్బైలక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టగా తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన నిధులు ఏమిలేవన్నారు. రానున్న ఐదేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అధిక నిధులను తెచ్చి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నిధులను కేటాయించి అన్ని విదాల అభివృద్ధి చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐడీసీ చైర్మన్ ఎం. సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, సింగిల్‌విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాటిపల్లి నర్సారెడ్డి, నాగుల శ్రీనివాస్, ఆర్మూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ కనకరవి, మాజీ సర్పంచ్‌లు కాటిపల్లి నర్సారెడ్డి, ఎం. సాయిరెడ్డి, శేఖర్, మాజీ ఎంపీటీసీలు మద్దుల రమేష్, రూపాల గంగారెడ్డి, కలిప్యాక్ మాజీ సింగిల్‌విండో చైర్మన్ మామిడి భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఏయిర్‌పోర్టు ఏర్పాటుకు తమ విలువైన పట్టాభూములను ఇచ్చేది లేదని వినతి

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లిలో ఏర్పాటు కానున్న ఏయిర్‌పోర్టు నిర్మానానికి తమ విలువైన పట్టాభూములను ఇచ్చేది లేదని ఏయిర్‌పోర్టు భూబాధిత రైతులు తేల్చిచెప్పారు.మంగళవారం జక్రాన్‌పల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడానికి వచ్చిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని జక్రాన్‌పల్లి, మనోహరబాద్, కలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాలకు చెందిన ఏయిర్‌పోర్టు భూబాధిత రైతులు ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం తమ విలువైన పట్టా భూములను ఇచ్చేది లేదని ఈ విలువైన భూములను ఏయిర్‌పోర్టుకు ఇస్తే ఉపాధి కరువై రైతు కుటుంబాలు రోడ్డున పడతాయని ఈ విలువైన రైతుల పట్టాభూములను ఏయిర్‌పోర్టుకు ఇచ్చేది లేదని భూబాధిత రైతులు స్పష్టం చేశారు. ఈ ఏయిర్‌పోర్టు భూబాధితులు ఇచ్చిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ ఏయిర్‌పోర్టు ఏర్పాటు కోసం 16 వందల ఎకరాల భూమి అవసరం ఉందని ప్రభుత్వం, ఏయిర్‌పోర్టు అథారిటి ఆఫ్ ఇండియా బృందం అధికారులు ప్రభుత్వానికి తెలిపారని ఇందులో జక్రాన్‌పల్లి, మనోహరబాద్, కలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాలలో కలిపి 800 ఎకరాల రైతుల పట్టాభూమి పోతుందని తేలిందన్నారు. ఏయిర్‌పోర్టు భూబాదిత రైతుల విన్నపం మేరకు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే భూబాధిత రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐదు గ్రామాల ఏయిర్‌పోర్టు భూబాధిత రైతులు పాల్గొన్నారు.

చదువుకున్న ప్రతీ ఒక్కరు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి


పచ్చలనడ్కుడలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అన్వేష్‌రెడ్డి

వేల్పూర్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):చదువుకున్న ప్రతీఒక్కరు ప్రతీరోజు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డి సూచించారు. జేడీ ఫౌండేషన్ వారి గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో ఏర్పాటు చేసిన కాళోజీ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి జేడీ ఫౌండేషన్ తెలంగాణ కన్వీనర్ పింగిలి కవితారెడ్డి లతో కలిసి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని చదువుకున్న యువతి యువకులు గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని వివిధ విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామస్థుల సహకారంతో ఈ గ్రంథాలయాన్ని నడుపుకోవాలని జేడీ ఫౌండేషన్ వారి ఉన్నత ఆశయాన్ని కొనియాడారు. గ్రామంలో చదువుకున్న యువకుల భవిష్యత్తు కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని అందుకు మీ సహకారం కావాలని జేడీ ఫౌండేషన్ జేడీలక్ష్మీనారాయణ, అఫౌండేషన్ తెలంగాణ కన్వీనర్ కవితారెడ్డిలను అడగగానే గ్రంథాలయం ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందిం చిన వారికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ వ్యక్తికి జ్ఞానం ముఖ్యమని జ్ఞానాన్ని మించిన ఆస్తి లేదన్నారు. సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత పుస్తకం దూరం అవుతుందన్నారు. పుస్తకాలు ఎంత చదివితే అంత జ్ఞానం వస్తుందన్నారు. చదువుకుంటున్న పిల్లల కోసం పోటీ పరీక్షలకు, చరిత్రకు సంబందించిన పుస్తకాలన్ని ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే ప్రతీ పనిలో ఈ గ్రామవాసిగా ఈ గ్రామంలో పుట్టినందుకు తప్పకుండ ముందుంటానని అన్వేష్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, టక్కారి గంగాధర్, గట్టవతల నర్సారెడ్డి, సచిన్, కృపాల్, నెహ్రూ, ముత్తెన్న, అలీముద్దీన్, గంగారెడ్డి, రాజేందర్, బోజన్న, నర్సయ్య, మోహన్, లింగేశ్వర్, విడిసి సభ్యులు, యువతి యువకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి : సీపీఎం

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరు సమైక్యంగా ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపైన విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 28మందిని పొట్టన పెట్టుకున్నారని ఉగ్రవాదులకు మతాలు, కులాలు ఏవీ పనికి రావని, దేశంలో అల్లకల్లోలం సృష్టించడం ద్వారా ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టి అశాంతిని కలిగించడమే వారి ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం, ఇంటెలిజెన్స్ విభాగం భద్రత దళాలు ముందుగా పసిగట్టక మూలంగానే ఉ గ్రవాదులు చొరబడ్డారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల, మతాల వ్యత్యాసాలను సృష్టించడానికి తద్వారా ప్రజల్లో విద్వేషాలను పెంచి రాజకీయ లబ్ధి పొందడానికి తన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ పౌరులందరు ఐక్యంగా తిప్పి కొట్టాలని అప్పుడు ఉగ్రవాదాన్ని అరికట్టవచ్చన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నూర్జహాన్, శంకర్ గౌడ్, నన్నేసాబ్, గంగాధరప్ప, మల్లేష్, గంగాధర్, పోశెట్టి, కుమారస్వామి, గోపి తదితరులున్నారు.


ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

భీమ్‌గల్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి):భీమ్‌గల్ మున్సిపాలిటీ కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులకు మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్, పిహెచ్‌సీ డాక్టర్ అజయ్ పవర్‌లు మంగళవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. అంతకు ముందు ప్రతీ కార్మికుడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవికాలం దృష్ట్యా ప్రతి కార్మికుడు ఎండవేడి నుంచ ఉపశమనం పొందేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను క్రమం తప్పకుండా నీటిలో కలుపుకొని తాగాలని డాక్టర్ కార్మికులకు సూచించారు. వడదెబ్బ నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన కొత్త ఆర్ఓఆర్ చట్టం-2025 భూభారతి గురించి బుధవారం మండల కేంద్రంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. ఉదయం 10గంటలకు స్థానిక రైతు వేదికలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవోలు హాజరుకానున్నారని తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి

వర్ని,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏసిక అర్చన(53) బడాపహాడ్‌లో కూలీ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తోంది. సోమవారం ఎండలో పనికి వెళ్లే యత్నంలో వడదెబ్బకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేస్తే తప్ప వీరికి పూట గడవదు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై తేలాడు..

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని గాంధీనగర్ వడ్డరకాలనికి చెందిన వేముల పోశెట్టి (55) గత రెండురోజుల క్రితం అదృశ్యమై కాలనీ సమీపంలోని గుండ్ల కుంట చెరువులో మంగళవారం శవమై తేలినట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 27 న సాయంత్రం ఇంటినుంచి బయలుదేరిని పోశెట్టి ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులను ఆరాతీశారు. ఈ విషయమై పోశెట్టి కూతురు వేముల గంగామణి స్థానిక పోలీసులకు తన తండ్రి కనిపించడంలేదని 28 న ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసునమోదు చేశామన్నారు. గాలింపు చర్యల్లో భాగంగా కాలనీసమీపంలోని గుండ్ల కుంట చెరువు గట్టుపై పోశెట్టికి సంబందించిన బట్టలు, ఇతర వస్తులు గుర్తించారు. కాగా.. మంగళవారం ఉదయం చెరువులో శవమైతేలినట్లు తెలిపారు. శవపంచినామా అనంతరం శవాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు నవీపేటలో జగన్నాథ శోభాయాత్ర

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం శ్రీ జగన్నాథ శోభాయాత్ర మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు అల్లి ప్రవీణ్, సీహెచ్ లోకేష్‌లు తెలిపారు. లోక కల్యాణార్థం చేపట్టిన ఈ జగన్నాథ శోభాయాత్రను మధ్యాహ్నం 4గంటలకు స్థానిక భక్త మార్కండేయ ఆలయం నుండి ప్రారంభమై రాత్రి 9గంటల వరకు మండల కేంద్రంలోని పుర వీధులలో నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు. ఈ సందర్భంగా భజనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహ హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు.

కనీస పింఛన్ సాధన కోసం పోరాడుదాం

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): కనీస పింఛన్ సాధనకై పోరాడుదామని టీయూసీఐ రాష్ట్ర నాయకులు మల్లేష్ అన్నారు. మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని గంటల పెంపుదలను కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొడుతూ విధివిధానాలు, కనీస పింఛన్‌ల సాధనకై పోరాడుదామన్నారు. ఎన్ఎంఆర్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. మే 1వ తేదిన జరిగే మేడే దినోత్సవాన్ని పనిగంటల పెంపుదలను, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, గంగాధర్, రాజు, లక్ష్మి, మసీద్, పోశెట్టి, వాహబ్, గణేష్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో ఈ నెల 30వ తేదిన నిర్వహించనున్న మహనీయుల జయంతిని విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర నాయకులు పరిమి కోటేశ్వర్ రావు, బోధన్ కన్వీనర్ నీరడి ఈశ్వర్ అన్నారు .ఈ సమావేశంలో నీరడి రవికుమార్, సింగాడే పాండు, కొండ్ర వెంకటి, కారం స్వామి, దేవేందర్, సురేందర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్‌లో ఇసుక టిప్పర్లు ఆపి కూలీల నిరసన

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని సిద్దాపూర్ ఇసుక క్వారీ వద్ద కూలీలు ఇసుక టిప్పర్లను ఆపి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సిద్దాపూర్ క్వారీ నుంచి అధికారికంగా వారంలో మూడు రోజులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీయడానికి అధికారులు పర్మిషన్ ఇస్తున్నారన్నారు. ట్రాక్టర్‌లకు కాకుండా టిప్పర్‌లకు పర్మిషన్ ఇవ్వడంతో లేబర్లుగా పని చేసే వారికి ఉపాధి లేకుండా పోతుందన్నారు. వెంటనే టిప్పర్లను నిర్వాహకులు జేసీబీలతో నింపుతున్నారని, దీని వల్ల తమకు కూలీ దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

బెజ్జోరా గ్రామంలో ఇసుక డంప్ సీజ్


సీజ్ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బెజ్జోరా గ్రామంలోని కప్పల వాగునుండి అక్రమంగా ట్రాక్టర్‌లతో ఇసుకను తీసి డంపు చేశారని, వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం ఆ డంప్ ను పరిశీలించారు. డంఫ్ చేసిన వారిని వే బిల్లులు అడగగా వారివద్ద ఎలాంటి అనుమతి లేకపోవడంతో డంప్ చేసిన 25 ట్రాక్టర్ల ఆసుకను సీజ్ చేశారు. ఆ సీజ్ చేసిన ఇసుకను వచ్చే నెల ఒకటవ తేదీ ఉదయం 12 గంటలకు బహిరంగంగా వేలంపాట నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ముందుగా పది వేల రూపాయలు తహసీల్దార్ కార్యాలయంలో డిపాజిట్ చేయాలని ఎవరు ఎక్కువ వేలం పాడితే వారికే ఇసుకను స్వాధీనం చేస్తామన్నారు. ఒకవేల వేలం దక్కని వారికి డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తే వాల్టాచట్టం ప్రకారం వాహనాలను సీజ్ చేసి ఇసుక మాఫీయాపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లారీల కొరతను తీర్చాలని శాఖాపూర్‌లో రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి లారీల కొరతను వెంటనే తీర్చాలని కోరుతూ మంగళవారం సాయంత్రం మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని శాఖాపూర్ శివారులో పలువురు రైతులు రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని బినోల సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా ధాన్యం తూకం వేసి 10 రోజులు గడుస్తున్న లారీలు అందుబాటులో లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొన్నారు. ఈ విషయంపై తమకు వెంటనే న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏఎస్ఐ యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రాస్తారోకో ప్రదేశానికి చేరుకుని వారికి నచ్చజెప్పడంతో వారు తమ ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో శాఖాపూర్‌కు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం మున్సిపల్ కమీషనర్ రాజు పరిశీలించారు.దరఖాస్తుదారుల స్థితిగతులను, అర్హతలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట క్లస్టర్ ఆఫీసర్‌లు కిరణ్, కిషన్, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ న్యాయాధికారిగా శ్రీదేవి

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో ప్రిన్సిపల్స్ సీనియర్ సివిల్ న్యాయాధికారిగా శ్రీదేవి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు స్వాగతం పలికి శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏ.బాబాగౌడ్, లయన్ గుజరాతీ నివేదన్, అశోక్ పాల్గొన్నారు.


న్యాయాధికారిని సన్మానిస్తున్న మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మాక్లూర్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):మండలంలోని అమ్రాద్ గ్రామంలో మంగళవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యధికారి డాక్టర్ కిరణ్‌దేశ్ పాండే తెలిపారు. పాడిరైతులు ఇట్టి టీకాలను తమ పశువులకు తప్పకుండా తీసుకోవాలని తద్వార పశువుల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గకుండా సమూలంగా వ్యాధిని పారదోలడానికి ప్రతీ పశువుకు టీకాలు వేయవల్సిన అవసరం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినిత, కళ్యాణి, షైమద్‌పాషా, శ్యామల, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడితే కేసులు

ఏర్గట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఏర్గట్ల ఎస్సై రాము తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో డ్రంకెన్‌డ్రైవ్ వాహనాల తనిఖీ చేశారు. అందులో భాగంగా వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, సరియైన ధృవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని వాహనధారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివయ్య, సుమన్, కిషోర్‌లు పాల్గొన్నారు.

చెరువు తూము షట్టర్లకు మరమ్మతులు చేయించాలని వినతి

ఆర్మూర్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు మూడు తూములకు షట్టర్లకు మరమ్మత్తులు చేయించాలని ఆర్మూర్‌లోని మూడు పంతాల రైతులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డిని కలిసి విన్నవించారు.కాశీహనుమాన్ పంతా,గురడి కాపు పంతా, కాపెల్లిపంతా రైతులు మంగళవారం వినయ్‌రెడ్డిని కలిసి మర మ్మతు లు చేయించాలని కోరారు.తూములకు మరమ్మతులు చేయిస్తు సుమా రు 400 ఎకరాల ఆయకట్టుకు తాగునీరు అందుతుందని రైతులు తెలిపారు. స్పం దించిన వినయ్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్క రి స్తామనిఅన్నారు.ఈకార్యక్రమంలో మూడుపంతాల రైతులు,నాయకులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్పించడంలో ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అంబేద్కర్ చౌరస్తాలో అడ్డుదిడ్డంగా ఆటోలను పెట్టవద్దన్నారు.ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలి

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వినయ్ కోరారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు స్థానిక బాసర రోడ్డు మూల మలుపు వద్ద హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని ఆయన సూచించారు.

48గ్రాముల అల్ఫాజోలం పట్టివేత: ఇద్దరి అరెస్టు

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో సుద్దులం భూమాగౌడ్ వద్ద 21గ్రాముల అల్ఫాజోలం, మండలంలోని తుంగినికి చెందిన రామాగౌడ్ వద్ద 27గ్రాముల నిషేధిత అల్ఫాజోలంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. సంబంధిత నిషేధిత అల్ఫాజోలంను కల్లులో కలిపి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు జరిపి ఈ అల్ఫాజోలంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంబంధిత అల్ఫాజోలం విలువ సుమారు 24వేల రూపాయల వరకు ఉంటుందని ఎస్ఐ వివరించారు. ఈ మేరకు సుద్దులం భూమాగౌడ్, రామాగౌడ్‌లను మంగళవారం అరెస్టు చేయడంతో పాటు వీరి వద్ద ఉన్న బైక్‌ను సైతం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సుద్దులం భూమాగౌడ్ మాక్లూర్ మండలం చిక్లీకి చెందిన వ్యక్తి అని అతడు జన్నేపల్లిలో కల్లు డిపోను లీజుకు తీసుకుని నడిపిస్తున్నాడని ఎస్ఐ తెలిపారు.


నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు


రైతులు రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం


ధాన్యం వెంటనే తరలించాలని రాస్తారోకో చేస్తున్న రైతులు(ఫైల్)

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

● నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంత పరిధిలో ధాన్యం కొనుగోళ్లలో మరింత ఆలస్యం ● రోడ్లపైనే ధాన్యం బస్తాలు ● వర్షాలు కురుస్తాయని ఆందోళనలో రైతులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకోడిగా సాగుతోంది. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పరిధలో ఆలస్యం జరుగుతోందంటున్నారు. వర్షాకాలంతో పోల్చి చూస్తే యాసంగిలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగులో సన్నరకాల సాగుకే రైతులు మొగ్గుచూపారు. ఖరీఫ్‌లో ప్రభుత్వం సన్నరకం వరిధాన్యానికి క్వింటాలుకు రూ.500 లు బోనస్ ఇవ్వడంతో రైతులు యాసంగిలో అధిక విస్తీర్ణంలో సన్నరకాలను సాగుచేశారు. గత సంవత్సరం సన్నరకం వడ్లను రైతులు ముందుగానే భయటవ్యాపారులకు విక్రయించారు. అనంతరం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరించిన వరిదాన్యానికి సన్నరకానికి క్వింటాలుకు రూ. 500లు బోనస్‌లు అందజేసింది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చింది. రైతు భరోసా డబ్బులు వేయకున్న దానిని మర్చిపోయారు. ప్రస్తుతం సన్నరకం దాన్యం పండించిన ప్రతీరైతు రూ. 500 లు బోనస్ దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయిస్తున్నారు. దీంతో దాన్యం బస్తాల తరలింపులో జాప్యం జరుగుతుంది.

వేధిస్తున్న లారీల కొరత

దాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వరిదాన్యం బస్తాలను రైస్ మిల్లులకు చేరవేయడానికి లారీల కొరత ఏర్పడింది. జిల్లాలో 65 రైస్ మిల్లులకే దాన్యాన్ని పంపాల్సి ఉంటుంది. లారీలు తీసుకెళ్తున్న దాన్యాన్ని రైస్‌మిల్లులో అన్‌లోడ్ చేయడానికి రెండురోజుల సమయం పడుతుండటంతో దాన్యం నిల్వలు అలాగే ఉంటున్నాయి. గత సంవత్సరం ఒక్క కొనుగోలు కేంద్రం నుంచి రోజుకు నాలుగు లారీల ధాన్యం రైస్‌మిల్లులకు చేరవేయగా ప్రస్తుతం రెండు లారీలు మాత్రమే వెళ్తుండడంతో దాన్యం బస్తాలు లిఫ్ట్ చేయడంలో జాప్యం జరుగుతుంది. సకాలంలో లారీలు రాకపోయే సరికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా స్థానిక రైస్‌మిల్లులలో ధాన్యాన్ని కోట ప్రకారం పంపాల్సి వస్తుంది. రైస్‌మిల్లు కోట ముగిసిపోతే అధికారులు అలాట్‌మెంట్ చేసేవరకు వేసిచూడాల్సిందే. దీనివల్ల రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆందోళనకు గురవుతున్న రైతులు

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు ఆరబెట్టిన దాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన దాన్యం బస్తాలు అలాగే ఉండడంతో ఎండకు ఎండిన, వర్షాలకు తడిసిన నష్టపోవాల్సింది రైతులే. దీనిని దృష్టిలో పెట్టుకుని తమ దాన్యాన్ని వెంటవెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రాస్తారోకో, ధర్నాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వర్షాలు కురిస్తే తాము పండించిన పంట చేతుకు రాకుండా పోతుందని దాన్యం తడిసిన, ధాన్యం రంగుమారిన తమకు నష్టాలే మిగులుతాయని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు లారీలా కొరతను లేకుండా చూసి కొనుగోలు కేంద్రాల నుంచి దాన్యం బస్తాలను వెంటవెంటనే తరలించి రైతులు నష్టపోకుండా చూడాలని వారు కోరుతున్నారు.

సకల శుభాలను అందించే
అక్షయ తృతీయ



నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సకల శుభాలను అందించే పర్వదినంగా అక్షయ తృతీయను జరుపుకుంటారు. ఏడాది పొడవునా వచ్చే అత్యంత శుభ ముహూర్తాలలో అక్షయ తృతీయ ఒక్కటి. అక్షయ తృతీయ నాడు నిర్వహించే ప్రతీ పనిలో విజయవంతం అవుతుందని విశ్వసిస్తారు. ఈ రోజున చేసే ధానం, పూజ, పనులు, శుభ ముహూర్తాలు తరిగిపోవని శాస్త్రం చెబుతోంది. అక్షయ తృతీయ పర్వదినాన్న ఆలయాల్లో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలతో పాటు పలు ఆలయాల్లో దేవతా మూర్తులకు చందన ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని వందలాది శుభ ముహూర్తాలకు వేదిక అవుతోంది. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలకు ఆయా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సిద్ధమయ్యాయి.

● వ్యాపార వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు

అంతేకాకుండా.. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యాపార వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈరోజున చేసే కొనుగోలు సంవత్సరం పొడవున మంచి జరుగుతుందనే భావనతో వినియోగదారులు అక్షయ తృతీయ పర్వదినాన్న కొనుగోళ్లు చేయడానికి ఆసక్తి చూపుతారు. దీన్ని అదనుగా చూసుకొని వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించడానికి ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నారు. గృహ సంబంధమైన వస్తువులతో పాటు ఈ పర్వదినాన్న బంగారు కొనుగోళ్లపై ఆసక్తి చూపడంతో ప్రతీ గ్రాము బంగారం కొనుగోలుపై వ్యాపారులు ప్రత్యేక బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోళ్లపై ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని ప్రకటించడంతో పాటు బంగారం కొనుగోలు చేసిన వారికి పూజా కార్యక్రమాలు చేసి బంగారాన్ని అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

కాలభైరవ స్వామి
ఆలయంలో ప్రత్యేక పూజలు

● వైశాఖమాసం తొలి మంగళవారం అధిక సంఖ్యలో హాజరైన భక్తులు


కాలభైరవ స్వామికి పండ్లతో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం- ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలసిన కాలభైరవ స్వామి ఆలయంలో వైశాఖమాసం తొలి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణలతో గర్భగుడిలో పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం భైరవ.. ఓంఓం కాలభైరవ స్వామి అనే నామ స్మరణతో వైశాఖమాసం తొలి రోజునే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దేవున్ని వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. కామారెడ్డి జిల్లాతో పాటు వివిధ జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కలు చెల్లించుకున్నారు. బావి వద్ద స్నానాలు చేసి తడి బట్టలతో దేవునికి దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంతేకాకుండా శనేశ్వరాలయం, నవగ్రహాలయం, నాగేశ్వరాలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాం చంద్రం గుప్తా, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, అధికారులు, ఆలయ కమిటీ మాజీ చైర్మెనులు దోమకొండ శ్రీనివాస్ గుప్తా, గంజి సతీష్ గుప్తా మాజీ, రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయానికి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

శిథిలావస్థలో పశు వైద్య శాలలు

● ఇప్పట్టికీ ఇన్‌చార్జి డాక్టర్‌తోనే కొనసాగుతున్న వేల్పూర్ పశువైద్య శాల ● అయినా పట్టించుకోని అధికారులు

వేల్పూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ పశు వైద్యశాల మినహ మిగతా వేల్పూర్, పడిగెల, అంక్సాపూర్ గామాలలో పశువైద్యశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఈ దుస్థితి గత కొన్నేళ్ల నుంచి ఉంటు ప్రస్తుతం భవనాలు కూలడానికి ఉన్నప్పటికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు తీవ్ర ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు ఈ భవనాల స్లాబుపై నీరునిలిచి గోడల నుంచి నీళ్లు కారుతూ గోడలు తడిసి ముద్దవుతున్నాయి. అంతేకాకుండా భవనాల స్లాబ్‌ల పై నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు కూలిపోతాయో అని భయపడుతూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉండగా.. కేవలం 4 గ్రామాలలో మాత్రమే పశువైద్య శాలలు ఉన్నాయి. అందులో మూడు పశువైద్యశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. ఆ భవనాలు సుమారు యాభైయేళ్ల క్రితం నిర్మించినట్లు ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. ప్రస్తుతం అంక్సాపూర్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాత గ్రామ పంచాయితీ భవనంలో పశు వైద్యశాలను కొనసాగిస్తున్నారు. మండల గ్రామాలలో కలిపి గొర్రెలు, మేకలు సుమారు 15వేలు, గోజాతి గేదె జాతి కలిపి సుమారు 6వేల వరకు ఉంటాయని పశువైద్య సిబ్బంది తెలిపారు. 18 జీపీల పరిధిలో కేవలం 4 మాత్రమే పశువైద్య శాలలు ఉన్నందున మిగతా గ్రామాలలోని పశువులకు వ్యాధులు సోకితే చికిత్సల కోసం ఆ వైద్యశాలలకు వెళ్లాలంటే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పశువులు, గొర్రెమేకలు ఎక్కువగా ఉన్న


కూలడానికి సిద్దంగా ఉన్న పడిగెల పశువైధ్యశాల భవనం

గ్రామాల్లో గోపాలమిత్ర కేంద్రాలను ఏర్పాటు చేసి పశువుల వైద్యాన్ని అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. ఇప్పట్కైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలోనే నూతనంగా భవనాలను నాణ్యతతో నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

వేల్పూర్ పశువైద్య శాలకు ఇన్‌చార్జి డాక్టరే దిక్కు

మండల కేంద్రమైన వేల్పూర్ పశువైద్యశాలకు గత కొన్ని సంవత్సరాలుగా ఇన్‌చార్జి డాక్టరే విధులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం డాక్టర్ సంతోష్‌రెడ్డి పచ్చల నడ్కుడ గ్రామ వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్‌గా


శిథిలావస్థకు చేరిన వేల్పూర్ పశు వైధ్యశాల భవనం

విధులు నిర్వహిస్తు, అదనంగా వేల్పూర్‌కు ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పశువులకు సకాలంలో వైద్యం అందించడంలో ఇబ్బందులు తప్పడంలేదని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పట్కైన వేల్పూర్ పశువైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్‌ను నియమించి పశువులకు వైద్యం అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

నూతన భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాం

: సంతోష్‌రెడ్డి, పశువైద్యాధికారి, వేల్పూర్

వేల్పూర్, పడిగెల, అంక్సాపూర్ గ్రామాలలో పశువైద్య శాలలకు నూతన భవనాల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఆ మూడు గ్రామాలలోని పశువైద్యశాల భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. ఇలాంటి పరిస్థితుల్లో నూతన భవనాలు నిర్మించాల్సి ఉంది.

భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో వంటావార్పు

భిక్కనూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రాంగణంలో పార్ట్ టైం అధ్యాపకులు నిరవధిక సమ్మెలో భాగంగా వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి వినూత్నంగా నిరసన తెలిపారు. దీనిలో భాగంగా సౌత్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైనా డిమాండ్‌లను పరిష్కరించాలని, వెంటనే జీవో నెం.21ను రద్దు చేయాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు. లేనియెడల కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్ట్‌ం టైం, కాంట్రాక్ట్, రెగ్యూలర్ అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధ్యాపకులు

పాఠశాలలకు సెలవులు..
వ్యవసాయ పనుల్లో చిన్నారులు!


జుక్కల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పిల్లలకు సెలవులు ప్రకటించడంతో పసిపిల్లలు వ్యవసాయ పనుల్లో వారి తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తూ వ్యవసాయ పనులు చేస్తున్నారు. మంగళవారం జుక్కల్ మండలం బస్వాపూర్ గ్రామం వద్ద రోడ్డుపై వరి ధాన్యం, పిల్లలు ఎండ బెట్టారు. వ్యవసాయ కుటుంబంలో ఉన్న పిల్లలు వారి తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనుల్లో పాలుపంచుకుంటున్నారు. వరి ధాన్యం ఎండబెట్టడం పశువులకు నీళ్లు తాగించడం గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చేస్తున్న పనులు దర్శనమిస్తున్నాయి.


వరి ధాన్యం ఆరబోస్తున్న చిన్నారులు









దేశ నాయకులు, ప్రకృతి అందాల ఫొటోలు గీసిన సాయిరుద్ర

చిత్రలేఖనంలో రాణిస్తున్న బుడ్డోడు

● చేతితో అందమైన చిత్రాలు గీస్తున్న సాయిరుద్ర
● పలు పోటీల్లో బహుమతులు

గాంధారి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నేటి రోజుల్లో పిల్లలు పాఠశాల ముగియగానే ఇంటికి వచ్చిన తర్వాత ఎక్కువ సమయం ఫోన్‌లు, టీవీలలోనే గడిపేస్తున్నారు. దీంతో పిల్లల్లో ఇతర నైపుణ్యాలకు చోటు లేకుండా పోయింది. పిల్లలు తమ విరమకాల సమయంలో వారికి ఉన్న ఆసక్తిలో తగినంత శిక్షణ అందిస్తే.. వారు విభిన్న రంగాల్లో రాణించగలరు. ఆరో తరగతి చదువుతున్న సాయిరుద్ర చిత్రలేఖనంలో తనకున్న ఆసక్తితో అద్భుతమైన చిత్రాలు గీస్తు తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

ఆరో తరగతిలోనే అందమైన చిత్రాలు

సాయిరుద్ర జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. చిత్రలేఖనంలో తనకున్న ఆసక్తితో ప్రతీరోజు పాఠశాల నుంచి రాగానే.. ఆకర్షణీయమైన చిత్రాలు గీయడం అలవాటు చేసుకున్నాడు. చిత్రాలు వేయడంలో పాటు వాటికి అద్భుతమైన రంగులు వేస్తు చక్కని రూపం వచ్చేలా చిత్రాలు గీస్తున్నాడు.


ఆజాద్ ఫొటోను గీస్తున్న సాయి


పోటీలలో బహుమతులు గెలుచుకున్న సాయి

అన్నిరకాల చిత్రాలు

చిత్రలేఖనంలో కేవలం ఒకరమైన చిత్రాలే కాకుండా అన్ని రకాలైన చిత్రాలు గీస్తు అబ్బురపరుస్తున్నాడు. దేశ నాయకులైన గాంధీ, భగత్‌సింగ్, మోదీలతో ఇలా వ్యక్తుల ఫొటోలతో పాటు, ప్రకృతికి సంబంధించిన అద్భుతమైన చిత్రాలు, దేవతల చిత్రాలు, సాధారణ వ్యక్తుల చిత్రాలు కళ్లకు కట్టినట్లుగా గీయడం సాయిరుద్ర ప్రత్యేకత. అంతేకాకుండా సముద్రం, అలలు, లైట్‌హౌస్ వంటి చిత్రాలు నిజమనే భ్రమను కలించేలా గీశాడు.

పలు పోటీల్లో బహుమతులు

పాఠశాలలో నిర్వహించే చిత్రలేఖన పోటీలలో పలుమార్లు బహుమతులు గెలుచుకున్నాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బాలోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలో ద్వితీయ స్థానం సాధించాడు. అదేవిధంగా రిలియన్స్ సంస్థ నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచి పురస్కారం అందుకున్నాడు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన



శుద్ధీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో భూగర్భ జలాల పనులు నత్తనడకగా నడుస్తున్నాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగస్థాన్ ఫేస్ 1లో జరుగుతున్న భూగర్భజలాల పనులు మురుగునీటి శుద్ధీకరణ కర్మాగారాన్ని మంగళవారం ప్రజా ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నగరపాలక సంస్థకు అమృత్-2 కింద భూగర్భజలాల అభివృద్ధి, వాటర్ వర్క్స్ పనులకు సుమారు రూ.400కోట్లు విడుదల కావడం జరి గిందన్నారు. భూగర్భ జలాల పనులలో భాగంగా నగరంలో 150మ్యాన్ హోల్స్ పునర్‌నిర్మాణం చేసినట్లు 45కొత్తవి నిర్మాణం చేసినట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి కిలోమీటర్ పైప్‌లైన్ వేయడం జరిగిందన్నారు. పనులు నాణ్య తతో పూర్తిచేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. అర్బన్ నియోజకవర్గంలో రాబోయే ఏడాదిన్నర కాలంలో ప్రతి ఇంటికి డ్రైనేజీ కనెక్షన్ ఇచ్చి నగరంలో డ్రైనేజీ సమస్యను తీరుస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో డీఈ నాగేష్‌రెడ్డి, సాయిచంద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీ నారాయణ, ఆనంద్‌రావు, సాయిప్రవీణ్, పవన్,ఆనంద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పహల్‌గామ్ బాధితులకు నివాళులు



నివాళులర్పిస్తున్న పేపర్ బాయ్స్, ఏజెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):కాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన కాల్పులలో మరణించిన అమరులకు నివాళులర్పిస్తూ మంగళవారం రాత్రి నిజామాబాద్ పేపర్ బాయ్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిం చడంతో పాటుఅసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులకు అభినందన సభ



సిబ్బందికి జ్ఞాపికలు అందజేస్తున్న జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మేడేను పురస్కరించుకొని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికుల అభినందన సభను సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆసుపత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ కొంత మందికి ఉత్తమ వర్కర్లుగా గుర్తించి జ్ఞాపికలను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది సేవల ద్వారానే ఆసుపత్రికి రాష్ట్రస్థాయిలో మంచి పేరు వస్తుందని డాక్టర్ల తర్వాత ప్రాధాన్యత కలిగిన వృత్తి సానిటేషన్, పేషెంట్ కేర్ అని వారు పనిచేయకుంటే ఆసుపత్రికి వివిధ రకాల జబ్బులతో వచ్చేవారు ఆరోగ్యంగా తిరిగి వెళ్తున్నారని అన్నారు. ఆసుపత్రికి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడం కోసం వీరు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మేడే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పనిచేసి జిల్లా ఆసుపత్రిని రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలపాలన్నారు.ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ రవికిరణ్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, ఏడీ రాజశేఖర్,చంద్రకళ, పాల్గొన్నారు.

డీసీఎం వ్యాన్‌లో చెలరేగిన మంటలు



సిర్పూర్‌లో డీసీయం వ్యాన్‌కు మంటలంటుకున్న దృశ్యం

మోపాల్,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ గ్రామం నుంచి ముదక్‌పల్లికి డీసీఎం వ్యాన్‌లో పశుగ్రాసం తరలిస్తుండగా కరెంట్ వైర్లు తగిలి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంఎదుట సోమవారం సాయంత్రం జరి గింది. సంఘటనను గమనించిన స్థానికులు తమతమ ఇండ్లలో ఉన్న బోర్‌పైపల ద్వారా మంటలను ఆర్పివేశారు. స్థానికులు మంటలను ఆర్పకపోతే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని గ్రామ పెద్దలు తెలిపారు. స్థానికులు ఈ మంటలు చెలరేగిన దృశ్యాన్ని డ్రైవర్‌కు చెప్పడంతో నడుస్తున్న వ్యాన్‌ను అక్కడే ఆపేశాడు. మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. అధికారులు వచ్చేలోపు స్థానికులు మంటలను ఆర్పివేశారు.

రెండో టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):నగరంలోని రెండవ టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎస్సైగా పనిచేసిన యాసర్ అరాఫత్‌ను ఇటీవల మెండోరా ఎస్సైగా బదిలీ చేశారు. జగిత్యాల జిల్లాలో వీఆర్‌లో పని చేస్తున్న సయ్యద్ ఇమ్రాన్‌ను రెండవ టౌన్ ఎస్‌హెచ్‌వోగా పోస్టింగ్ ఇచ్చారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మర్యాదపూర్వకంగా ఉన్నతాధికారులను కలిశారు.

ఎల్లారెడ్డిపల్లిలో పూర్వవిద్యార్థుల కలయిక



ఆత్మీయంగా కలిసిన పూర్వవిద్యార్థులు

ఇందల్వాయి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామం ఉన్నత పాఠశాలలో చదివిన 1994-95 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం ఒకచోట కలుసుకున్నారు. గడిచిన గతాన్ని మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ నాటి తీపిగుర్తులను అల్లరి చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. అనంతరం చదువులు చెప్పిన గురువులకు పాదాభివందనం చేసి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు ఐక్యతతో పనిచేయాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

డిచ్‌పల్లి,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలిసి ఐక్యతతో పనిచేసి అభ్యర్థుల విజయం కోసం శ్రమించాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం డిచ్‌పల్లి కేఎన్‌ఆర్ గార్డెన్‌లో జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ...నాయకులుగా ప్రజల సమస్యలు తీర్చడానికి ఎక్కువ సమయం ఇవ్వాలని అప్పుడే ప్రజానాయకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. పదవుల కోసం పాకులాడితే కుదరదని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు జిల్లాకు అభివృద్ధి చేయాలేదని విమర్శించారు. పార్టీ చిన్నచిన్న తాగాదాలు, వివాదలు సృష్టిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. తాను మంత్రిగా ఉన్నపుడే సాగు నీరు అందించాలనే దృడసంకల్పంతో మంచిప్ప ప్రాజెక్టు ప్యాకేజీ 21,22,23 లను తీసుకొస్తే ఆ ప్రాజెక్టును గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, రూ.300కోట్లతో అయిపోయే దానిని రూ.3వేల కోట్లకు పెంచి కాంట్రాక్టర్ లకు పంచిపెట్టారని విమర్శించారు. ప్రజలకు సేవ చేసేలా నాయకులు లక్ష్యం పెట్టుకొని ముందుకు సాగాలని కార్యకర్తలు ఐక్యంగా ఉంటే అందరికి పదవులు వచ్చే తాము కృషి చేస్తామన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు గ్రామ, మండల, బ్లాక్ కమిటీల ఏర్పాటుకు అందరు సహకరించలన్నారు. కార్యకర్తలకు బాధ్యతలు, పదవులు ఇవ్వడమే తమ పార్టీ లక్ష్యమని భూభారతి ద్వారా రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నమన్నారు. కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో కమిషన్లు తీసుకున్నరని కానీకాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవ ర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి పేదలను ఆదుకుంటుందన్నారు.

● క్షేత్ర స్థాయిలో బలోపేతం కోసమే సమావేశాలు

(ఎమ్మెల్సీ, పీసీసీ ఎన్నికల అబ్జర్వర్ బల్మూరి వెంకట్)

కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేలా ఇలాంటి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని పీసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ,సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ క్షేత్ర స్థాయిలో సంస్థగతంగా పార్టీ బలోపేతం చేయాలని సిద్ధాంతాలను నమ్ముకున్న వారిని అధిష్టానం అబ్జర్వర్‌లుగా నియమించిందన్నారు. తాను జిల్లాకు కాంగ్రెస్ కార్యకర్తగా రావడం జరిగిందని జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీ కోసం కష్టపడే వారిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించేలా సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి జిల్లా స్థాయిలో బహిరంగ సభ నిర్వహించాల్సి ఉంటుందని అన్ని నియోజకవర్గ నాయ కులను సమన్వయం చేసుకొని సమావేశం నిర్వహన ఉంటుందన్నారు. జిల్లా స్థాయి సమావేశం జరిగిన విధంగా అన్ని అసెంబ్లీలలో అందరు నాయకులను కలుపుకొని మే 4 నుంచి 10లోపు నియోజకవర్గ సమవేశాలు



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నిర్వహించాలని పార్టీ అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు నిర్వహిస్తున్నరో అనేది తేదీలు తెలపలన్నారు. కష్టపడ్డ వారిని తప్పక పార్టీ గుర్తిస్తుందని, రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా వేరే నియోజక వర్గలలో పని చేశానని తెలిపారు. 2017 కు ముందు నుంచి పార్టీలో కొనసాగుతున్న వారికి అన్ని అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అభ్యర్థిగా ప్రకటించే ముందు వారి అనుభవం పార్టీకి పనిచేసిన విషయాలు రిపోర్టు ఇవ్వలని సూచించారు. క్రమశిక్షణ కలిగిన వారికే పార్టీ పదవులు వస్తాయి.

● స్థానిక సంస్థల ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయాలి : రూరల్ ఎమ్మెల్యే

భారాస, భాజపాలు కలిసి పనిచేస్తున్నాయని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ తీసుకొచ్చిన పథకాలు బీజేపీ పాలితా రాష్ట్రాలలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. భారాస 25ఏళ్ల సంబరాలు ఏవరికోసం జరిపారో భారాస ఏర్పాటు జరిగి 3ఏళ్లు మాత్రమే అయిందన్నారు. తెరాస ఉన్నప్పుడు తెలంగాణ పదం వద్దని ఇప్పుడు తెలంగాణ కోసం మాట్లాడటం విడ్డురమన్నారు. ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి మాటాడుతూ... కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేస్తే విజయం కాంగ్రెదేనని అన్నారు. పార్టీ సమావేశాలకు గైర్హాజరైతే పదవుల నియమకాల్లో వారి పేర్లను పరిగణలోకి తీసుకొబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేశ్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు తాహెర్ బిన్ హందాన్, అన్వేశ్‌రెడ్డి, బాలరాజు, నూడ చైర్మన్ కేశవేణు, ఆర్మూర్ పార్టీ ఇన్‌చార్జ్ వినయ్‌రెడ్డి, బాల్కొండ ఇంచార్జ్ సునీల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికేల నర్సారెడ్డి, ఆకుల లలిత, రాజేశ్వర్, ఎనుగు రవీందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, జావిద్ అక్రమ్, పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, 36 మండలాల అనుబంధ విభాగాల అధ్యక్షులు, డిచ్‌పల్లి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, కార్యవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తనిఖీ చేసిన బోధన్ ఎమ్మెల్యే

● మూలనపడ్డ వాహనాలను రిపేర్ చేయించాలి: సుదర్శన్ రెడ్డి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని పాండుఫారంలో గల డంపింగ్ యార్డులను మంగళవారం ఉదయం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాద ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన కారణాలను మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులో ఎవరెవరు ఏఏ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరు చేయడంతో మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం ఎంత అని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సరిగా మెంటనెన్స్ చేయకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డులోని వేయింగ్ మిషన్‌లో తేడాలు రావడం ఏమిటని ప్రశ్నించారు. 120కిలోల తేడాలు రావడంపై ఆయన జిల్లా తూనికలు, కొలతల అధికారిని ఫోన్‌లో మాట్లాడారు. మరోమారు బోధన్ డంపింగ్ యార్డును తనిఖీ చేయాలని వేయింగ్ మిషన్‌ను సరి చేయాలన్నారు. అలాగే వడ్ల కొనుగోలు కేంద్రాలలో కాంటాలను సైతం తనిఖీ చేశారు. బోధన్ మున్సిపాలిటీలో వాహనాలు, ట్రాక్టర్లు ఎన్ని ఉన్నాయి, ఎన్ని పని చేస్తున్నాయి అని కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు నుండి మున్సిపాలిటీకి వెళ్లి మూలనపడ్డ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన వాహనాలు ఇలా చిన్న చిన్న రిపేర్ల కారణంగా మూలనపడడం సరికాదన్నారు. మూలనపడ్డ వాహనాలను వెంటనే మరమ్మత్తులు చేయించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విభాగంలో పని చేస్తున్న నలుగురు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. వారు ఎన్ని సంవత్సరాలుగా పని చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. లక్షలు ఖర్చు పెట్టి డంపింగ్ యార్డు నిర్వహణ సరిగా చేయకపోవడంపై సంబంధిత యంత్రాంగంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డులో ఉన్న మట్టిని అవసరమైన ప్రజలు ఎలాంటి రుసుము లేకుండా తీసుకెళ్లాలని సూచించారు. డంపింగ్ యార్డు ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆయన వెంట బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డీఈ విఘ్నేష్, సంబంధిత శాఖ అధికారులు తదితరులున్నారు.

కొత్త జంక్షన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదన

● ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి : నూడా చైర్మన్ కేశవేణు



పరిశీలిస్తున్న నూడా చైర్మన్ కేశవేణు

సుభాష‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా కొత్త జంక్షన్‌లను ఏర్పాటు చేయాలని నూడా చైర్మన్ కేశవేణు అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నగర కమిషనర్ దిలీప్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణతో కలిసి పరిశీలించారు. నగరంలోని వివిధ జంక్షన్‌లలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువగా ఎదురవుతున్నాయని, సమస్యలను పరిష్కరించేందుకు కొత్తజంక్షన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా వినాయక్‌నగర్, బోధన్ రోడ్, గౌతంనగర్, హైదరాబాద్ బైపాస్ ఏరియాల్లో నీరు ఎక్కువగా నిలిచిపోతుందని, వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా నీరు సాఫీగా వెళ్లడానికి పెద్దనాలాలు నిర్మించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్‌అలీ షబ్బీర్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నగరం స్మార్ట్ సిటీగా ఎదుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ప్రవీణ్, ట్రాఫిక్, ఆర్‌అండ్‌బి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో పాత వాహనాల వేలంపాట

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి పోలీస్ ఏడవ బెటాలియన్ ఆధ్వర్యంలో పాత వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, బ్యాటరీలను కొని విక్రయించే వ్యాపారులకు వేలంపాటలో విక్రయించడం జరుగు తుందని బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు మే 2వ తేదీన ఉదయం 11గంటలకు డిచ్‌పల్లి ఏడవ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

నీట్ పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ : సీపీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మే 4న నిర్వహించే నీట్ పరీక్ష సందర్భంగా జిల్లాలోని పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్‌ను అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అక్రమాలు జరుగకుండా వంద మీటర్ల పరిధిలో నిషేధ సామగ్రిని తీసుకెళ్లడం, ఇద్దరికంటే ఎక్కువ వ్యక్తులు కలిసి వెళ్లడం, అదే విధంగా జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సీపీ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష జరిగే ఆదివారం రోజు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6.30ల వరకు ఈ నిషేధ ఆజ్ఞలు పరీక్షలు జరిగే పరిసర ప్రాంతాల్లో అమల్లో ఉండనున్నట్లు సీపీ తెలిపారు.

న్యాల్‌కల్ రోడ్‌లో ఆక్రమణల తొలగింపు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):నగర పాలక సంస్థ పరిధిలోని న్యాల్‌కల్ రోడ్‌లో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్న దుకాణా సముదాయాలనుమున్సిపల్ శాఖ, ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తొలగించారు. నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో కొంత కాలంగా వీధి వ్యాపారులు, దుకాణా సముదాయాల యజమానులు రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలను కొనసాగించడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. దీంతో మంగళవారం ఉదయం నుంచి మున్సిపల్ శాఖ, టౌన్‌ప్లానింగ్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు ఆక్రమణలను తొలగించారు. మళ్లీ ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎక్సైజ్ అధికారులకు అభినందన

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గంజాయిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన జిల్లా ఎక్సైజ్ అధికారులను రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి కమలాసన్‌రెడ్డి అభినందిం చారు. హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను సన్మానించి నగదు బహుమతిని అందజేశారు. కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న 30.5 కిలోల గంజాయిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న, ఇన్‌స్పెక్టర్ రాముతో పాటు సిబ్బందిని అభినందించి నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీ సోమిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా మౌనం పాటించిన న్యాయాధికారులు

నిజామాబాద్‌లీగల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద దాడి ఘటనకు నిరసనగా జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మంగళవారం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించారు.

కుల బహిష్కరణ చేశారు

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

ఇందల్వాయి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన రామాగౌడ్ తన కుటుంబాన్ని అదే గౌడ కులానికి చెందిన కొందరు మాపై కక్షకట్టి కులబహిష్కరణ చేశారని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గత 8 సంవత్సరాలుగా కులబహిష్కరణ చేసి నన్ను నా కుటుంబాన్ని వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. గౌడ కులసంఘంలో నాకు రావాల్సిన సొమ్ము వాటాను ఇవ్వకుండా, కులవృత్తిని చేయనివ్వకుండా అడ్డు పడుతున్నారని, కులంలో ఎవరితో మాట్లాడవద్దని మంచి చెడులకు పిలవవద్దని, కుల సంఘానికి సంబంధించిన ఇతర పనులకు పిలవవద్దని వాట్సాప్ గ్రూపులలో పెట్టి నా కుటుంబాన్ని వేధిస్తున్నారని అన్నారు. గతంలో కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. నా గౌడ కులం నుంచి రక్షణ కల్పించి నా కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు.

నగరంలో యువతి ఆత్మహత్య

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల నాగారం 300 క్వార్టర్స్ ప్రాంతంలో నివాసం ఉండే సంధ్య (20) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త లేబర్ పని నిమిత్తం బయటకు వెళ్లగా ఆయన వెళ్లిన తర్వాత సంధ్య ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు.

నేడు ధర్పల్లిలో ఎమ్మెల్యే పర్యటన

ధర్పల్లి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):మండలంలో బుధవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్ తెలిపారు. ఉదయం 11గంటలకు కాలేజ్‌తాండా, గోవింద్‌పల్లి, ఇంద్రనగర్ తాండా, బేల్యాతాండా, ఎస్‌బీ తాండా, దమ్మన్నపేట్ గ్రామాల్లో జరిగే వివిధ అభివృద్ధి పనుల కార్యక్రమాలకు పాల్గొననున్నారు.మధ్యాహ్నం మండల కేంద్రంలోగల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవ రణలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.ఈ సమావేశంలో కళ్యాణలక్ష్మి, షాదీము బా రక్ చెక్కుల పంపిణీతో పాటు ధర్పల్లిలో జరిగే వివి ధఅభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన నున్నట్లు ఆయన చెప్పారు.

కార్మికులందరికీ మేడే రోజు సెలవు ఇవ్వాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల కార్మికులకు మేడే రోజు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీయుసీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికశాఖ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ శ్రావణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులందరికి మేడే పండగ రోజన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మేడే సెలవు రోజుగా పరిగణించబడుతుందన్నారు. మేడే సెలవు రోజును పెయిడ్ హాలీడేగా కేంద్ర ప్రభుత్వం మార్చిందన్నారు. దీంతో సెలవు రోజు ఉండదన్నారు. పనిచేసిన కార్మికులకు అదనపు వేతనం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. యాజమాన్యం కార్మికులకు అదనపు వేతనం ఇవ్వడం లేదన్నారు. అదే సమయంలో కార్మికులు సెలవులు కోల్పోతున్నారన్నారు. కార్మికులను సంఘటితం కాకుండా పోరాటస్ఫూర్తికి దూరంగా నెట్టివేయడానికి మేడే జరపకుండా మోది ప్రభుత్వం కుట్రపన్నిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికలోకం తిప్పికొట్టాలన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. జిల్లాలోని కార్మికులకు మేడే సెలవు రోజు తీసుకోవాలని, అనివార్యంగా పనిచేస్తే యాజమాన్యాన్ని అదనపు వేతనం అడగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకన్న, రాజేశ్వర్, జిల్లా నాయకులు సాయన్న, ఇంతియాజ్, ధర్మపురి, కిషన్, గంగన్న, లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, గంగాధర్, పీవైఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలి'

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులకు గత ఏడాది కాలం నుంచి వేతనాలు మూడు నాలుగు నెలలు ఆలస్యంగా వస్తున్నాయని వేతనాలు ఇవ్వకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ మరియు డీఆర్‌డీవోలకు వినతిపత్రం ఇచ్చారు. ఈనెల 30వ తేదీన జిల్లా, మండల కార్యాలయాల్లో పెన్‌డౌన్ / షట్‌డౌన్ సహాయ నిరాకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురువారం పెన్‌డౌన్ / షట్‌డౌన్, శుక్రవారం ప్రజాభవన్‌కు వెళ్లి శాంతియుత నిరసన కార్యక్రమాలు, 3వ తేదీన మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వనున్నారు. పేస్కేల్‌ను అమలు చేయడంతో పాటు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు.